క్లుప్తంగా

రత్నగిరిపై నవదంపతుల సందడి



అనివేటి మండపంలో సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవదంపతులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శనివారం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై 50కి పైగా వివాహాలు జరిగాయి. నవదంపతులతోపాటు రాష్ట్రంలో పలు చోట్ల వివాహాలు చేసుకున్నవారు కూడా సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు కళకళలాడాయి. ఆలయంలో నవదంపతులు సందడి చేశారు. సుమారు 20 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించగా, 2వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షలు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

సత్యదేవునికి ప్రత్యేక పూజలు



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలోని సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో శనివారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్ర, భగవద్గీత, లక్ష్మీ అష్టోత్తర, లలితాసహస్ర పారాయణాలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, శిరీష, మంగామణి, రేవతి, శ్రీదేవి, కామాక్షి, జ్యోతి, కందుల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హౌసింగ్ డే



కాకరాపల్లి లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శర్మ

కోటనందూరు: హౌసింగ్ డే సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం జగనన్న కాలనీలను సందర్శించారు. కాకరాపల్లిలో జగనన్న కాలనీని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, హౌసింగ్ ఏఈ శేఖర్, ఏపీఎం సూర్యకుమారి, విద్యుత్ శాఖ అధికారులు సందర్శించి, అక్కడ వసతులపై ఆరా తీశారు. కాలనీలో బోరుబావి, విద్యుత్ వంటి కనీస వసతులను వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. లబ్ధిదారులంతా త్వరితగతిన ఇళ్ల నిర్మించుకోవాలని సూచించారు. ప్రతి శనివారం కాలనీలకు వస్తామని, సమస్యలు చెబితే పరిష్కరిస్తామని లబ్ధిదారులకు వివరించారు. ప్రభుత్వం నిబంధనలు పాటిస్తూ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. వ్యవసాయ సలహామండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి పథకాలు ప్రారంభం



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

రౌతులపూడి: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామ పంచాయతీ సాధరణ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చిన్నదివాణం అన్నారు. శనివారం ఎస్.పైడిపాలలో ఎస్సీ, ఎస్టీ పేటలో రూ.4.50లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకులను పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాద్, పారెపల్లి శ్రీరామకృష్ణ, గొల్లు వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వై.నానాజి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులాపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మోటారుసైకిల్‌పై ఉప్పాడ వెళుతుండగా కొత్తపల్లికి చెందిన ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై ఉప్పాడ నుంచి వస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, వారిని స్థానికులు పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి కాకినాడకు తీసుకెళ్లారు. పూర్తి వివరాలు వచ్చిన తర్వాత దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

ఆనందం పదింతలు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల విజయకేతనం



ప్రథమ స్థానంలో నిలిచిన కల్యాణికి స్వీట్ తినిపిస్తున్న తండ్రి కోటేశ్వరరావు



కాకరాపల్లిలో అధిక మార్కులు సాధించిన గంటా తులసిని అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

ఏలేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఏలేశ్వరం మండల వ్యాప్తంగా 65శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ అబ్బాయి తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి 15 పాఠశాలలకు చెందిన 864 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 565 మంది ఉత్తీర్ణత సాధించారు. 129 మంది విద్యార్థులకు 500 మార్కులు దాటి వచ్చాయి. మండలంలో 8 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 674 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 398 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 59 శాతం వచ్చింది. వీరిలో 53 మంది విద్యార్థులకు 500 మార్కులు దాటి వచ్చాయి. ఏలేశ్వరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అత్యధికంగా 75 శాతం ఉత్తీర్ణత రాగా, పెద్దనాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అత్యల్పంగా 44 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

తుని మండలంలో 68.08 శాతం

తుని రూరల్: మండలంలో 68.08 శాతం మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ పరవాడ గీతాదేవి తెలిపారు. శనివారం విడుదలైన పరీక్షా ఫలితాల వివరాలను ఆమె తెలిపారు. 16 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1617 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారన్నారు. వీరిలో 1101 (68.08 శాతం) మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ తెలిపారు.

పది ఫలితాల్లో బాలికల హవా

తుని: ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలికలు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. తుని సీతారాంపురం ఉన్నత పాఠశాల నుంచి 93 మంది హాజరు కాగా 54 మంది ఉత్తీర్ణత సాధించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కమిషనర్ ప్రసాదరాజు, ఎంఈవో పరవాడ గీతాదేవి అభినందించారు.

సర్కారీ స్కూల్ విద్యార్థినులు

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బాలికలు పదో తరగతి పరీక్షల్లో సత్తాచాటారు. మండల వ్యాప్తంగా 11 హైస్కూళ్లకు చెందిన 844 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవ్వగా 439 మంది పాసయ్యారని ఎంఈవో షేక్‌బాబ్జి వివరించారు.

పది ఫలితాల్లో 56 శాతం ఉత్తీర్ణత

కోటనందూరు: పది పరీక్షా ఫలితాల్లో కోటనందూరు మండలం 56 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాస్ శనివారం తెలిపారు. మండలంలోని ఆరు హైస్కూళ్లు, కేజీబీవీ పాఠశాల నుంచి 394 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 207 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఎంఈఓ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పది ఫలితాల్లో 92.3 శాతం ఉత్తీర్ణత

అన్నవరం: స్థానిక దేవస్థానం హైస్కూల్ 92.3 శాతం ఉత్తీర్ణత సాధించిందని ఆ హైస్కూల్ హెచ్ఎం అల్లాడ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. మొత్తం 26 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో ప్రథమశ్రేణిలో ఆరుగురు, ద్వితీయ శ్రేణిలో 11, తృతీయ శ్రేణిలో ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరు ఫెయిలైనట్టు తెలిపారు.

గోకవరం మండలంలో 357 మంది ఉత్తీర్ణత

గోకవరం: మండలంలో పదో తరగతి ఫలితాల్లో 357 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు, 5 ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 817 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 357 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 49 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు అభినందించారు. భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.రవి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రౌతులపూడిలో 74 శాతం

రౌతులపూడి: మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఒక ప్రైవేటు పాఠశాలతో కలసి మొత్తం 549 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 405 మంది ఉత్తీర్ణత(74శాతం) సాధించారని ఎంఈఓ ఎస్వీ నాయుడు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల హవా

శంఖవరం: మండలంలో 13 హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు 747 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 507 మంది ఉత్తీర్ణత (68శాతం) సాధించినట్టు ఎంఈఓ ఎస్వీ రమణ తెలిపారు.

జగ్గంపేట మండల ఉత్తీర్ణత శాతం 64.36

జగ్గంపేట: మండలంలో పదో తరగతి పరీక్షలకు 1100 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 708 మంది విజయం సాధించారని ఎంఈఓ ఆర్.స్వామి తెలిపారు. మండలంలో ఉత్తీర్ణత శాతం 64.36గా ఉందని, రాజపూడి, కాట్రావులపల్లి, జగ్గంపేట, అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులు సాధించారని తెలిపారు.

ప్రత్తిపాడులో 46.20 శాతం

ప్రత్తిపాడు: పదో తరగతి పరీక్షల్లో ప్రత్తిపాడు మండలం 46.20 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని ఎనిమిది జిల్లా ఉన్నత పాఠశాలలు, ఒక గిరిజన ఆశ్రమ పాఠశాల, నాలుగు ప్రైవేటు పాఠశాలల్లోని 936 మంది పరీక్షలకు హాజరయ్యారు.

సహాయ కార్మిక అధికారిగా కార్తీక్



కార్మిక శాఖ సహాయ అధికారి కార్తీక్

తుని: కార్మిక శాఖ సహాయ అధికారిగా టి.ఎస్.కార్తిక్ బాధ్యతలు స్వీకరించారు. కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించి, సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని, కార్మికులు, యాజమానులకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలియజేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్, ఇతర కార్మిక సంఘాలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్మిక చట్టాలను సమర్థవంతగా అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

తుని: రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నామని తుని శాఖ అధికారి జి.రంగనాథరావు శనివారం తెలిపారు. ఈ శిబిరంలో కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, పెద్దల నుంచి విన్న అముద్రత కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్ సృజనాత్మక కార్యక్రమాలు రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు.

గోకవరంలో భారీ వర్షం

గోకవరం: మండలంలో పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రభావం చూపించగా సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం 4.30 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జగన్ జనరంజక పాలన



రౌతులపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- రౌతులపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

రౌతులపూడి: ప్రజల సంక్షేమమే ధ్యేయం పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని మరొకసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన రౌతులపూడి సచివాలయం-1 పరిధిలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పార్టీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా గత నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సీహెచ్‌సీ పథకంలో రాయితీపై అందించిన ట్రాక్టను ఆయన ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటారి అర్జునమ్మ, సర్పంచ్‌లు రాపర్తి రామకృష్ణ, సర్నం శ్రీను, యెనుముల కోటిబాబు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి దాడిశెట్టి రాజా
- రేఖవానిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



రేఖవానిపాలెంలో సంక్షేమ పథకాలపై మహిళతో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం రేఖవానిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన మంత్రి దాడిశెట్టి రాజా మహిళలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఆరా తీశారు. చంద్రబాబు ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, తమ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్న ఆలోచనతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ, పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తూనే సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్టు చెప్పారు. గతంలో చంద్రబాబు నాయుడి ప్రభుత్వం కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అందుతున్నాయని పలువురు మహిళలు తెలిపారు. ఇంటి నిర్మాణాలకు రుణాలు అందించాలని, అర్హత ఉన్నా ఉమ్మడి కుటుంబంలో రేషన్ కార్డులు ఉన్నందున పింఛన్లు మంజూరు చేయడంలేదని వివరించారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న విద్య కానుకలు, రైతు భరోసా, తదితర పథకాలు అందుతున్నాయా లేదాని ప్రశ్నించారు. ఒక్కొక్క కుటుంబాలను నాలుగేళ్లలో ఎంత మేరకు లబ్ధి చేకూరింది వివరించారు. అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌ని గెలిపిస్తామని మహిళలు పేర్కొన్నారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరారవు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, నాయకులు డబ్బూరి నాగశివ, రామచంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో అదనపు కోర్టు ఏర్పాటు



సభలో ప్రసంగిస్తున్న మానవేంద్రనాథ్‌రాయ్

ప్రత్తిపాడు: స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో మరో అదనపు కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హైకోర్టు జడ్జి, తూర్పుగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ హామీ ఇచ్చారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో రూ.93 లక్షలతో నిర్మించనున్న జడ్జి క్వార్టర్ భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో జరిగిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు కోర్టులో 2,800 కేసులు పెండింగ్‌లో ఉన్నందున మరో అదనపు కోర్టు ఆవశ్యకత ఉందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 22 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఐదేళ్లకు మించి కేసులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. ప్రత్తిపాడు కోర్టులో ఉపయోగంలో లేని ×ఈ×కోర్టును వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హైకోర్టు జడ్జి, తూర్పు గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ తెలిపారు. ఈ సభలో హైకోర్టు జడ్జి పి.మల్లికార్జునరావు, ఏసీబీ కోర్టు జడ్జి ప్రసాద్, జిల్లా జడ్జి గంధం సునీత, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.రవికృష్ణ, స్థానిక కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎం.సుధారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సీహెచ్ పుల్లయ్య, బి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యాయవాదులు అతిథులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు.

ఆక్రమణల తొలగింపు



కోటనందూరులో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ

కోటనందూరు: స్థానిక బస్టాండు సెంటర్లో ట్రాఫిక్ సమస్యకు అజ్యం పోస్తున్న ఆక్రమణలను శనివారం అధికారులు తొలగించారు. ఈ సెంటర్లో తుని-నర్సీపట్నం రోడ్డును చిరువ్యాపారులు భారీగా ఆక్రమించేయడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ, పంచాయతీ, ఆర్అండ్‌బీ, పోలీసు శాఖల సమన్వయంతో ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఆ తొలగించిన ప్రాంతంలో మరుగుదొడ్లు నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఆక్రమణల తొలగింపును ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కురందాసు రాంబాబు పరిశీలించారు.

మంత్రి రాజాను కలిసిన జాషువాగిరి



మంత్రి రాజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాషువాగిరి

తుని: కాకినాడ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులుగా నియమితులైన డి.జాషువాగిరి రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాజాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జాషువగిరి క్రిస్టియన్ మైనార్టీలకు సంబంధించిన పలు అంశాలను మంత్రి రాజా దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి రాజా దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి ప్రార్థించారు. తుని క్రిస్టియన్ రీజనల్ కమిటీ అధ్యక్షుడు పాక కృపావరం, స్టీఫెన్ ఆనంద్, ఎస్.సాల్మన్‌రాజు, తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు చెందిన క్రిస్టియన్ నాయకులు పాల్గొన్నారు.

అడవి జంతువు వేటలో లేగదూడ బలి

- మరో లేగదూడపై దాడి
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అటవిశాఖ అధికారులు



అడవి జంతువు వేటలో మృతిచెందిన లేగదూడను పరిశీలిస్తున్న అధికారులు

గండేపల్లి: పొలంలో ఉన్న లేగదూడలపై గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేయడంతో అక్కడిక్కడే మృతి చెందగా మరో లేగదూడకు స్వల్పగాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని మల్లేపల్లికి చెందిన గొల్లపల్లి బుల్లబ్బాయి (చిన్నోడు) తన పశువులను పొలంలోనే కట్టేసి ఉంచాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి పాలు తీసుకుని వాటికి మేత వేసి ఇంటికి వచ్చేశాడు. శనివారం ఉదయాన్నే పశువుల మకాం వద్దకు వెళ్లే సరికి ఒక లేగదూడ మృతి చెంది మరో లేగదూడకు స్వల్పగాయాలతో ఉండడాన్ని గమనించి పెద్దపులి దాడి చేసి ఉంటుందని అటవిశాఖ అధికారులకు సమాచారం అందజేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు మృతి చెందిన లేగదూడపై గాయాలు, స్వల్పంగా గాయపడిన లేగదూడను పరిశీలించి పెద్దపులి కాదని హైనాలు గాని, రేసు కుక్కలు గాని, అడవి కుక్కలు గాని, నక్కలు గాని దాడి చేసి ఉంటాయని కాకినాడ జిల్లా అధికారి రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులను పొలాల్లో ఉంచొద్దని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో ప్రచారం చేయించారు. అడవి జంతువులు వేటాడిన ప్రదేశం, సంచరించిన ప్రదేశాల్లో కెమెరాలు, సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. సంఘటన స్థలానికి చుట్టుపక్కల సుమారు కిలోమీటర్ మేర వరకూ అడవి జంతువు ప్లాస్టర్ పారీస్‌తో వాటి పాదముద్రలను సేకరించారు. సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో అక్కడ నుంచి వచ్చి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అడవి జంతువులు పాద ముద్రలను బట్టి గుంపుగా వచ్చి ఉంటాయని, పంట పొలాలలో ఉన్నాయా? లేక అటవీ ప్రాంతానికి వెళ్లిపోయాయానే సందిగ్ధంలో అధికారులు ఉన్నారు. సాయంత్రం కురిసిన అకాల వర్షానికి కెమెరాలు ఏర్పాటుకు ఆటంకం ఏర్పడడంతో ఆదివారం ఏర్పాటు చేయనున్నారు. ఎస్ఓ కె.సిద్ధార్థ, బీట్ ఆఫీసర్స్ నూకాసాహెబ్, సూర్యనారయణ, శివ, సంధ్యారాణి, రాధాక్రిష్ణ, ఉపేంద్ర రెడ్డి, హెల్పర్స్ రెడ్డి, తదితర అటవీ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అడవి జంతువు వేటలో లేగదూడ మృతి చెందిన విషయం గ్రామాల్లో తెలియడంతో చుట్టు పక్కల గ్రామస్తులు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంఘటన స్థలాన్ని గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్, సిబ్బందితో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

బాలికలకు ప్రత్యేక తరగతులు

- 132 మందికి వి.కొత్తూరు కేజీబీవీలో వసతి
- బైపీసీ, ఎంపీసీ, ఎంపీహెచ్‌సీ, హెచ్ఎస్ విద్యార్థినులకు బోధన



వి.కొత్తూరు కేజీబీవీలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు హాజరైన ఇంటర్ విద్యార్థినులు

తుని రూరల్: బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవల వెలువడిన ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఈనెల 24వతేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఫెయిలైన విద్యార్థినుల సైతం ఉత్తీర్ణత సాధించేలా విద్యను బోధిస్తున్నారు. ప్రోత్సహించకపోతే ఫెయిలైన విద్యార్థినులు పై చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 12 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. తుని మండలం వి.కొత్తూరు కేజీబీవీలో ఆ విద్యార్థినులతో పాటు కోటనందూరు, తొండంగి, శంఖవరం కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థినులకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 4.15 గంటలు వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

నాలుగు గ్రూపుల విద్యార్థినులకు ప్రయోజనం

ప్రత్యేక తరగతుల్లో బైపీసీ, ఎంపీసీ, ఎంపీహెచ్‌సీ, హెచ్‌సీ గ్రూపుల విద్యార్థినులకు ఆయా సబ్జెక్టులలో నిపుణులైన అధ్యాపకులు బోధిస్తున్నారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులు 71 మంది, సెకెండియర్ విద్యార్థినులు 61 మంది హాజరవుతున్నారు. తుని మండలం నుంచి 29 మంది, కోటనందూరు మండలం నుంచి 44 మంది, శంఖవరం మండలం నుంచి 50 మంది, తొండంగి మండలం నుంచి తొమ్మిది మంది విద్యార్థినులు తరగతుల్లో పాల్గొంటున్నారు.

విద్యార్థినులకు పూర్తి రక్షణ



బాలికా సంరక్షణ జిల్లా అధికారుల ఆదేశాలతో ఇంటర్మీడియెట్‌లో ఫెయిలైన విద్యార్థినులకు ఈనెల 20వ తేదీ వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నాం. వేర్వేరు మండలాల నుంచి వచ్చిన విద్యార్థినులకు పూర్తి రక్షణ కల్పించేందుకు కేజీబీవీలోనే వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశాం. ప్రశాంతంగా చదువుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశాం. ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారులు, వారానికి ఒకరోజు చొప్పున ఆయా కేజీబీవీల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక తరగతులను సందర్శించి విద్యా బోధన, విద్యార్థినుల యోగక్షేమాలు తెలుసుకుంటారు.

– బి.అమృతవాణి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, వి.కొత్తూరు

రోగులకు భోజనం పంపిణీ

ఏలేశ్వరం: పట్టణానికి చెందిన రిటైర్డ్ పంచాయతీ కార్యనిర్వహణాధికారి జోగా సుకుమార్‌రాజు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం భోజనం పంపిణీ చేశారు. సుకుమార్‌రాజు సతీమణి కన్యప్రభ, కుమార్తె ఇందిరాప్రియదర్శిని ఆధ్వర్యంలో సుమారు 80 మంది పేషెంట్లకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సోదరి భారతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.